సాంధ్య కిరణాలు

రామనాథం వెనక్కు తిరిగాడు. గదిలోకివెళ్ళి మంచంమీద మేను వాల్చగానే ఆలోచనలు ముసురుకున్నాయి.

అతడిచెయ్యి అనుకోకుండా క్షణానికొకసారి నిద్రమాత్రలు పెట్టిన అల మారివైపు పోతున్నది. ఈ సంఘటన తనను సవాలు చేస్తున్నది. తను నలుగురిలో నిలబడలేక పోతున్నాడు, అందరిలో తనిక తలెత్తుకుని తిరగలేడు. పరాభవాగ్నితో దహించుకుపోయే ఈ జీవితాన్ని అంతమొందిస్తేనే మంచిది. జబ్బుగాఉన్న తండ్రి కోసం తెచ్చిన మాత్రలలో కొన్నితెచ్చి సీసాలోవేసి దగ్గర పెట్టుకున్నాడు. వారం రోజులుగా చేస్తున్న ఈ ప్రయత్నం క్రియారూపం దాల్చలేదింకా.

చెయ్యి మళ్లీ గూటివరకూ వెళ్ళింది.

''అందుకోవి నోట్లో వేసుకో. సిగ్గుమాలిన బ్రతుకును అంతం చేసుకో.'' మనసు ముందుకు నెట్టుతోంది.

''నీవెందుకు ప్రాణం తీసుకుంటావు. నీవేం తప్పుచేశావు. ఆత్మహత్య చేసుకోవలసింది నీవుకాదు'' బుద్ధి వెనక్కు లాగుతున్నది.

మనసు ముందుకూ వెనక్కూ ఉయ్యేలలా ఊగిపోతున్నది. పడకలో తొట్రుపాటు-ఆలోచనలో అస్థిరత్వము-ఏ దృశ్యముచూసినా నేత్రపీడాకరము-ఆప్తులే హంతకుల్లా కనబడటం; భగవంతుడా! ఏమిటీ ఈ నరకయాతన!

అతడి జీవితము సంతానము కలగనంతవరకూ ఏ ఒడిదుడుకులూ లేకుండా సాగింది. స్వచ్ఛమూ మధురమూ పవిత్రమూ అయిన గంగా స్రవంతిలా ప్రవహించింది. బాల్యమూ విద్యార్థిజీవితమూ చాల ఆదర్శప్రాయంగా గడిచిపోయాయి. దాంపత్య జీవితం నిత్యవసంతం.

"ఇప్పుడు మాత్రం ఏమయింది? వెర్రి మొర్రి ఆలోచనలు అంతమొం దించుకో. అంతా స్వర్గంలా కనబడుతుంది" ఎవరో గదమాయించినట్టు బాధ.

వెల్లిపాయలు వొలుస్తున్న కనకమ్మ తలవొంచుకొని గబగబా గదిలోకి వెళ్లు తున్న రామనాథాన్ని చూసి తెల్లబోయింది.

"రామనాథం చూసివచ్చావా పిల్లవాడిని?" కూర్చున్నచోటునుంచే అడిగింది.

"ఏమిటోయ్? కొడుకు పుట్టేసరికి చెవులు వినిపించకుండా పోయిన ట్లున్నాయే." జవాబు లేకపోయేసరికి వొలిచిన వెల్లిపాయలు గుప్పెట్లో పెట్టుకుని గుమ్మంలోనుంచే గదిలోకి తొంగి చూసినది గోడవైపుకు ముఖంపెట్టి మంచ మ్మీద పడుకున్న రామనాథాన్ని చూసి గతుక్కుమన్నది-ఆమె గుండె.

కనకమ్మ మనసప్పుడే శంకించటం మొదలుపెట్టింది. నలుగురు ఆడపిల్లల తరువాత ముద్దులొలుకుతూ ముచ్చటగా తన కూతురికి మగబిడ్డ పుట్టాడు. చూసి వచ్చిన అల్లుడి ముఖాన కత్తివేటుకే నెత్తురుచుక్క లేకుండాపోయిందేం?

"రామనాథం? జ్వరంగాని తగల్లేదు కదా ? అట్లా ఉన్నావేం? తల్లీ పిల్ల వాడు కులాసాయేకదూ ? మీకు భోజనాలుపెట్టి అమ్మాయికి కాఫీ తీసుకుపోవాలి" మంచానికి దగ్గరగా నిలబడ్డది కనకమ్మ.

"తలనొప్పిగా ఉందత్తయ్యా. కణతలు పగిలిపోతున్నాయి. ఓ గంటసేపు నన్ను ఒంటరిగా ఉండనియ్యి" రామనాథం ఒంటినిండా దుప్పటి కప్పుకున్నాడు.

అప్పటికప్పుడే కనకమ్మ మనసు పిల్లవాడి నక్షత్రంవైపు పరుగులుతీసింది పుట్టగానే పంచాగం చూపించింది. మాతా పితరులకు గండాలు లేవన్నాడు సిద్ధాంతి గారు తాత ముత్తవలకు కూడా ఏ విధమయిన బాధలూ లేవన్నారు. రామనాథం తలనొప్పికి ఉదయం పది గంటలకే మండిపోతున్న యెండతప్పు మరొక కారణం ఆమెకు గోచరించలేదు. బాలెంతకు వేళకు కాఫీ రొట్టె అందిస్తూ ఇంటి పనులన్నీ పిల్లల సహాయంతో నెట్టుకువస్తున్న కనకమ్మ మనసు ఉరుకులు పరుగులుగా ఉన్నది.

నరసింహం గేటుదగ్గర ఉండగానే "అన్నయ్యా తల్లినీ పిల్లవాడినీ చూసే వస్తున్నావుకదూ? ఇంటినుంచి ఏమయినా తీసుకురమ్మని చెప్పిందా అమ్మాయి?

నీవు చూసినప్పుడు పిల్లవాడు నిద్రపోతున్నాడనుకుంటూ'' ఆయన బదులు చెప్పక ముందే వంటయింట్లోకి వెళ్ళి కుంపటి రాజేసింది.

నరసింహం తలవంచుకొని లోపలికి వెళ్ళి చెప్పులు విడుస్తూ ''రామనాథం వచ్చాడా?'' ఆమె జవాబు చెప్పకముందే గదిలోకి తొంగిచూశారు. రామనాథం తల మీద కూడా దుప్పటి కప్పుకున్నాడు.

మధ్యాహ్నం భోజనంకాగానే వాకిట్లో పడక్కుర్చీలో కూర్చుని పేపరు చదువుతూ ఉండగా నరసింహానికి కళ్ళు మూతలుపడ్డాయి. తిరిగి ఆయన కళ్ళు తెరిచేసరికి కనకమ్మగానీ పిల్లలుగానీ ఇంట్లో లేరు ఆయనలేచి గ్లాసెడు మంచి నీళ్ళు తాగి రామనాథం గదిలో అడుగు పెట్టాడు.

అడుగుల చప్పుడుకు రామనాథం కళ్ళు తెరిచి మళ్ళీమూశాడు. నరసింహానికి సంతోషం పొంగులా పైకి లేచేసరికి కళ్ళల్లోనీళ్ళు నిలిచాయి. ఆప్యాయంగా రామనాథం ఒంటిమీద చెయ్యివేసి మంచంమీద కూర్చున్నాడు.

''అబ్బాయీ రామనాథం మనకు మంచిరోజులు వచ్చాయి చూశావా? వాడు ఆ పుట్టినబిడ్డ ఎంత ముచ్చటగా ఉన్నాడురా? నీవు బాగా చూసే ఉంటావు సిద్ధాంతిగారింటినుంచి వస్తున్నా శాంతి నక్షత్రం కాదన్నాడు. నీకు యోగకాలం ఆరంభమయిందని చెప్పాడు. సంసారికంగాను ఉద్యోగపరంగానూ కూడా నీ జీవితం ఇప్పటినుండే బాగుపడుతుందన్నాడు. కోడలు కూడా తేలిగ్గానే ఉంది.''

రామనాథం ఇంటికప్పుకేసి చూస్తున్నాడు. తండ్రిమాటలు విన్నట్టుగా ఊఁగాని ఆఁగాని అనలేదు.

నరసింహం రెండు నిమిషాలపాటు ఆసుపత్రిలో ఉన్న పసిబిడ్డ రూపాన్ని స్మృతికి తెచ్చుకున్నాడు. నాలుగేళ్ళ క్రిందట కోడలికి పురుడు వచ్చిననాటి సంగతి నరసింహానికి ఉదయంనుంచీ మనసులో మెదులుతున్నది.

నరసింహం చేతికర్ర గోడకానించి కాళ్ళు కడుక్కోవడానికి బయలుదేరాడు. ఆయన పెరటిద్వారం చేరకముందే కనకమ్మ'' ఆ గదిలోకి వెళ్ళి నీ కొడుకు కన్న సంతానాన్ని చూడు'' అంటూ దూకుడుగా లేచి వంట యింట్లోకి వెళ్ళింది. ఆ తోపిడికి తలుపులు గోడకు కొట్టుకుని పెద్దచప్పుడు అయింది.

నరసింహం ఆమె మాటలు వింటూ పెరటి తలుపు దగ్గర నిలిచిపోయాడు. "తన కొడుకుకన్న సంతానం" తల వంచుకుని కాళ్ళయినా కడుక్కోకుండా పురిటిగదిలోకి వెళ్ళిచూశాడు. మెత్తటి పొత్తిళ్ళల్లో తల పక్కకు పెట్టుకుని హాయిగా నిద్రపోతున్నది పసిబిడ్డ. ఒంగి బిడ్డముఖంలోకి చూశాడు. గుండె గతుక్కుమన్నది. చప్పున ఒక అడుగు వెనక్కువేసి తలవంచుకుని గిరుక్కున వెనక్కు మళ్ళాడు. "ఓ భగవంతుడా మేమేం పాపం చేశాము? నా ఒక్కగానొక్క కొడుకునూ కమ్మకమ్మటి కలలుకనే ఈ వయసులో ఇటువంటి సంతానంతో శిక్షిస్తున్నావా!" రెండు చేతులతో గుండెబాదుకున్నాడు. "ఇదెక్కడి పాపం? ఎప్పటి పాపం? దీనికి నిష్కృతిలేదా? నా కొడుక్కుకాదు. ఈ శిక్ష వాడు - నాకు" గుండెమీద చేతులతో కొట్టుకున్నాడు. రెండుచేతులతో తలపట్టుకొని కుర్చీలో కూలబడ్డాడు.

"ఇటువంటి బంగారు పాపాయిలను ఇచ్చిన దేవుడు వాళ్ళకు ముక్కూ నోరూ విడివిడిగా ప్రసాదించకూడదూ?" గుండె సహస్రశకలాలయిన బాధ అనుభవించాడు.

మూడవరోజు పథ్యం పెట్టేటప్పుడు తల్లి కూతుర్ని బ్రతిమిలాడుతున్నది. "అన్నం తినవమ్మా ముందు. ఏడ్చిఏడ్చి తలనొప్పి తెచ్చుకుంటావు. నీగొంతు నా రెండు చేతులతో కాశాను. ఆలోకంలో ఉన్న మినాన్నకూడా నీ కార్యానికి దుఃఖిస్తూ ఉంటారు" కూతురుకి ధైర్యం చెప్పబోయి తల్లి గుండె పగిలేటట్టు ఏడ్చింది.

పసారాలో పడకకుర్చీలో పడుకుని చుట్ట కాలుస్తున్న నరసింహం కుంచించుకు పోతున్నారు. అరుస్తూ ఇంటిని నరకప్రాయంగాచేస్తూ తననూ తనకొడుకునూ తిట్టిపోస్తున్న చెల్లెలు కనకమ్మ ఇటీవల తమఇద్దరిమధ్య రక్తస్పర్శ ఏ మాత్రం లేనట్టు మాట్లాడుతున్నది. పాతిక సంవత్సరాలనాడు మూడేళ్ళ శారదను ఒడిలో కూర్చోబెట్టుకుని పెనిమిటి పోయిన దుఃఖముతో కుమిలిపోయే కనకమ్మను ఓదార్చి తనయింటికి తీసుకువచ్చాడు. చిన్నప్పటినుంచీ కనకమ్మది పరమశాంత స్వభావము. అత్తవారింట్లో ఆకర్కోటకుల దగ్గరకూడా మంచిపేరు తెచ్చుకున్నది రూపాయలను గవ్వలుగా ఖర్చుచేసిన పెనిమిటిదగ్గర అతిఓరిమితో మెలగింది. ఆకనకమ్మకూ ఈ కనకమ్మకూ ఎంతభేదం?

భార్య చనిపోయిన తరువాత ప్రపంచమంతా తనకు చీకటిచీకటిగా ఉన్నప్పుడు కనకమ్మ ప్రవేశంతో తన యింటికి కళాకాంతులు వచ్చాయి. మేనల్లుడినీ తన కూతురినీ ప్రేమతో, మంచి శిక్షణ ఇస్తూ ఆమె పెంచింది. వెదకుదామన్నా ఏలోపమూ లేకుండా క్రమశిక్షణతో పెరిగారు రామనాథం శారద.

అటువంటి కనకమ్మ ఇప్పుడు ఇలా మారిపోయిందేమిటి? ఎందుకు?

శారదా రామనాథంల పెళ్ళి ఆపు చెయ్యాలని నరసింహం ఎంతో ప్రయత్నించాడు. "వాళ్ళిదరూ అన్నా చెల్లెళ్ళలా పెరిగారు. పోనిద్దూ వేరే సంబంధాలు చూద్దాం ఏమంటావు కనకమ్మా?" ఈమాట నరసింహం పెదవిదాటి దాటకముందే కనకమ్మ కొంగుతో కళ్ళు ఒత్తుకుంటూ "నీకు ఉన్నది ఆ కొడుకు ఒక్కడు నాకూ ఒకపిల్ల. వాళ్ళ పేరికే మూడుముళ్ళూవేసి మనం కృష్ణా రామా అంటూ కూర్చుందాము. ఇప్పుడా బయట సంబంధాలకు పోయి ఏమగచాట్లు పడతాం అన్నయ్యా" అన్నది పాలోచనగా.

నరసింహం చాలారోజులు ఆలోచించాడు. "కనకమ్మా, నీవన్నమాట నిజమే. గ్రహచారం చాలక వీళ్ళకేదైనా లోపం జరిగితే మనం భరించలేము. ఇద్దరికీ పరాయి సంబంధాలు చేస్తే ముద్దూ ముచ్చటలు బాగా జరుగుతాయి. ఆయిన వాళ్ళలో బాధ ఎందుకమ్మా?" అంటే ఆమె ఎంతకూ వినలేదు.

"అన్నయ్యా నన్ను వేరుచేస్తావా! నా కాపురం చెడి నీయింటికి వచ్చాను ఒక్కగానొక్క తోడబుట్టినవాడివి. కడుపులో పెట్టుకుంటావని నమ్మాను."కన్నీరు కారుస్తూ ఆయనముందు కూలబడిపోయింది.

నరసింహం ఆఖరిప్రయత్నంగా రామనాథం చేత కూడ చెప్పించాడు.

నరసింహానికి ఆ పెళ్ళి అసమ్మతమని చెప్పటానికి అంతరాత్మ ఒప్పుకోదు. ఒకరిలో ఉన్న లోపాలను మరొకరిలో భర్తీచేసి పరిపూర్ణంగా జీవించటానికి అనువుగా వాళ్ళిద్దరినీ తీర్చి దిద్దాడు దైవము. వాళ్ళిద్దరూ చిలుకాగోరింకలుగా ఉంటే తనూ సంతోషించినవాడే. ఆ జంట గదిలో కిచకిచలాడుతూఉంటే తన చెల్లెలితో పాటు తాను కూడా పెరట్లో జేమచెట్టు కింద కూర్చుని ఎంతో మురిపెంగా వాళ్ళ భవిష్యానికి నిచ్చెనలువేశాడు.

శారదను తన కోడలిగా చేసుకున్నప్పటినుండీ ఆమెకు ఏలోపమూ జరగు కూడదని ఎంతో జాగ్రత్తపడుతున్న నరసింహం ప్రకృతిచేసిన లోపానికీ వంచనకూ మోసానికీ పళ్ళు పటపట కొరికాడు. గుండె నెవరో పిండి వట్లయి అబ్బా అంటూ చేత్తో సర్దుకుంటూ కుర్చీలో కూర్చుని వెనక్కువాలాడు.

తనకు ఒక్కగానొక్క కొడుకు. అల్లారుముద్దుగా పెరిగాడు. దేవుడు ఎందుకు శిక్షిస్తున్నాడు ఇలా? ముద్దుగా కన్న సంతానాన్ని దగ్గరికి పిలిచి అక్కున చేర్చుకోలేక కొడుకు బాధపడిపోతున్నాడు. నిజంగా దేవుడు రామనాధానికి చేసిన శిక్షకాదు. తనకు చేసిన శిక్ష. రోజుకు రోజు కృశించిపోతున్న రామనాధాన్ని చూడ వలసి రావటమే తనకు శిక్ష. కసాయివాడి కత్తికింది పశువులా బోయవాడి చేతిలోని పక్షిలా నరసింహం గుండె గిలగిల కొట్టుకుపోయింది.

అమ్మయ్య! ఇంతకాలానికి ఇప్పుడు కృష్ణపక్షమిదాటిపోయింది. శుక్లపక్షము వచ్చింది. విశాఖపట్నంలో కాపురం పెట్టి నలుగురాడపిల్లలకూ ముక్కూ, పై పెదవి సర్దించి ప్లాస్టిక్ సర్జరీ చేయించాడు. అందుకు రెండెకరాలు సంతోషంగా అమ్మాడు. మాట స్పష్టంగా లేకపోయినా నలుగురు పిల్లలూ స్కూలుకు వెళ్ళు తున్నారు తమ కుటుంబాన్ని అలుముకుపోయిన కారుమేఘాలు విచ్చిపోయాయి. చంద్రబింబం తేజస్సులో ప్రకాశించే రోజులు వచ్చాయి. కొడుక్కు పుత్రోదయము మయింది. తీర్చి దిద్దినట్లున్న అవయవాలతో శారద కొడుకును కన్నదని విన్న క్షణాన నరసింహం మనసు స్వర్గపుటంచుల వరకూ పయనించి వచ్చింది.

''రామనాధం! ఏమిటిలా పడుకున్నావు? లేచి కాఫీ త్రాగు. అలా నర్సింగ్ హోముకు వెళ్ళివద్దాము లే''.

''తల నొప్పిగా ఉంది నాన్నా నీవు వెళ్ళిరా''

''అసలు ఒక్కసారయినా పిల్లవాడిని చూశావురా?''

చూశానన్నట్లు తలఊపాడు రామనాథం.

నరసింహానికి కొడుకు జవాబు ఏమాత్రం నచ్చలేదు. కోడలికి పురుడు వచ్చిన తర్వాత నరసింహానికి ఉన్న అనారోగ్యమంతా ఈ వారం లోపల మటు మాయమయింది. మానవుడు కష్టసమయంలో విచారపడాలి. సంతోష సమయంలో

ఆనందించాలి. అందుకు భిన్నంగా ఉంటె మానసికారోగ్యరీత్యా అనారోగ్యమన్న మాటే. ఉపాధ్యాయుడిగా ఆయన ఎంతో మంది పిల్లలను చూశాడు రామనాథం మనసు బాధపడి బండబారిపోయింది. ఇప్పుడు సంతోషాన్ని కలిగించే పరిస్థితులు ఏర్పడినా సంతోషం కలక్కుండా పోతున్నది. వెన్నెల్లో నిలిచి చీకట్లను పిలిచే వెర్రివాడిలా ఉన్నాడు రామనాథం.

స్వతః రామనాథం చురుకైనవాడు. ఉత్సాహవంతుడు. ఈ అంగవిహీన మయిన సంతానంతో ఆతడిని స్తబ్ధత ఆవరించి జడుణ్ణి చేసివేసింది.

నరసింహం మూలనున్న చేతికర్ర తీసుకుని నర్సింగ్‌హోముకు దారితీశాడు.

రామనాథం మళ్ళా నిద్రమాత్రల సీసా చేతిలోకి తీసుకున్నాడు. అంతలో కనకమ్మ హడావిడిగా గదిలోకి వచ్చింది. రామనాథం తటాలున సీసా దాచ బోయాడు. మూత వదులుగా ఉండటంచేత మాత్రలు అతడిచేతిలో పడి పక్కనిండా దొర్లిపోయాయి. లేచి అవన్నీ ఏరి మళ్ళీ సీసాలో పోశాడు. కనకమ్మ పెట్టెలన్నీ పెద్దచప్పుడుచేస్తూ తెరిచి బట్టలేవో తీసుకుని మూటకట్టుకు వెళ్ళింది.

రామనాథం గదిలోనుంచి బయటికి వచ్చాడు. ఇంట్లో ఎక్కడచూసినా సం దడి సందడిగా ఉన్నది. ఎవరిని చూసినా హడావిడిగా తిరుగుతున్నారు. తనకిప్పుడు ఏకాంతం కావాలి. మనస్థిమితాన్ని వెదుక్కోవాలి. ఊరి బయటనున్న కాలువ గట్టుకు దారితీశాడు. ఎత్తుగా ఒక రాతిమీద కూర్చున్నాడు. అతడిని తరిమి తరిమి కొడుతున్న ఆలోచనలు కూర్చోగానే చుట్టుముట్టాయి. "ప్రపంచంలో మానవుడు జీవితాంతం ఉత్తముడుగా ఉంటాడా? ఉండగలడా? లోకంలో ఎవరినీ నమ్మటానికి ఆస్కారము లేదా?—శారద తనను ఎంత నమ్మించింది? నమ్మించి ద్రోహం చేసింది-విశ్వాసఘాతకి."

ఆవేశంతో చివాలున లేచాడు. రామనాథం శారదను ఈ ఒక్కమాట ముఖాన అడిగివెయ్యాలి. శాశ్వతంగా అందరినీ వదలి దూరంగా పోవాలి.

తెల్లవారితే పదకొండు. శారద మంచంమీద పడి పసిబిడ్డను పెట్టుకుని కూర్చుంది. ఆమె కెదురుగా కుర్చీలో కూర్చుని ఆమె వంకే చూస్తున్నాడు రామ నాథం. వారిద్దరి మధ్య మౌనం గంటకుపైగా సంచరించింది.

"శారదా!"

పసిబిడ్డ చేతులు సర్దుతున్న శారద ఉలికిపడి తలెత్తింది.

"కష్టపడి మొత్తానికి కార్యం సాధించావు."

ఏమిటన్నట్లు కనుబొమలు పైకెత్తి చూసింది.

"అదే బిడ్డకు వికృతమయిన ముఖం రాకుండా ఉండాలని నీవుచేసిన కృషి సఫలీకృతమైనది కదూ?"

శారద అయోమయంగా అతడి ముఖంలోకి చూసింది.

"నేనూ గ్రహించానని తెలుసుకో" చివాలున లేచి బయలుదేరాడు. అతడి చూపులోని పద్మరాగపు జీరలు గ్రీష్మంలో మండుటెండలు కాశాయి.

శారదకు పరిస్థితి ఏమాత్రం అర్థం కాలేదు. ఏ వంకా లేకుండా నలుగురు ఆడపిల్లల తరవాత మగబిడ్డ పుట్టితే రామనాధానికి సంతోషంగా లేదా? ఈ చిట పటలు ఏమిటి? ఎవరిమీద కోపం? ఎందుకు? పచ్చిబాలెంత తలనొప్పి వచ్చేవరకూ ఆలోచించి ఆలోచించి అలసిపోయింది

తెల్లవారితే పురిటిస్నానం. ఆరోజే బిడ్డకు నామకరణం చేయాలని నర సింహం కనకమ్మ హడావడి పడుతున్నారు. తమ్ముడు యింటికి వస్తాడని పిల్లలు సంబరపడుతున్నారు.

రామనాథం భోజనానికి లేవలేదు. కనకమ్మ రెండుసార్లు వచ్చింది.

"నన్నిలా వదలిపెట్టు అత్తయ్యా. భోజనం చెయ్యకుండాఉంటే బాధలన్నీ సర్దుకుంటాయి" గోడవైపుకు తిరిగి పడుకున్నాడు.

"పోనీ కాఫీ తీసుకో రామనాథం ఆ తలనొప్పి సర్దుకుంటుంది"

"నాకేమీ వద్దు"

ఆమె వెళ్ళిన కాసేపటికి నరసింహం వచ్చాడు.

"ఏమిట్రా రామనాథం! తలనొప్పి అయితే ఏస్ప్రోవేసుకోకూడదూ?" ఒంటిమీద చెయ్యివేశాడు చల్లగావుంది.

''కాఫీ తాగి పడుకో పోనీ''

''వద్దు నాన్నా నన్ను పడుకోనీయండి''

''సరేలే. రేపు పొద్దునలేచి తలంటిపోసుకోవాలి సరిగ్గా పదకొండు గంట లకు పీటలమీద కూర్చోవాలి.''

రేపు సెలవు పెట్టటానికి వీల్లేదు నాన్నా. ఎవరో పైనుంచి వస్తున్నారని మా ఆఫీసరు చెప్పాడు.''

''పన్నెండు గంటలకు వెళ్ళవోయ్ వద్దన్నదెవరు ?''

నామకరణానికి కొత్తబట్టలు కట్టుకుని ముఖం ముడుచుకుని కూర్చున్నాడు రామనాథం. శారద పిల్లవాడిని ఒళ్ళో పడుకోబెట్టుకుని కూర్చుంది. ఆమె ముఖం బాగా వికసించిన తెల్లతామర పూరేకులా ఉన్నది. ఆమె విశాల నయనాలు మరింత విశాలమయినాయి. సౌష్టవ పూర్ణాంగాలలో నవచైతన్యం తొణికిసలాడుతున్నది. వదులుగా జారుముడి వేసుకున్నది. ముంగురులు ముఖంమీద లాస్యం చేస్తున్నాయి. చిరునవ్వు పెదవులమీద చిందులాడుతున్నది.

క్రీగంట ఆమెనుచూస్తూ తల పంకించాడు రామనాథం.

పురోహితుడు పిల్లవాడికి పెట్టబోయే పేరు బియ్యంలో వ్రాయమన్నాడు.

''నీకేదయినా కొత్తపేరు పెట్టాలని ఉన్నదా చెప్పు ? ఏ పేరయినా వెంకటే శ్వరుడి పేరు తరువాతనే.'' నరసింహం ఉత్సాహంతో చెప్పుకుపోతున్నాడు.

రామనాథం బియ్యంలో ఉంగరంతో పిచ్చిగీతలు గీస్తున్నాడు.

''అబ్బాయీ పెద్దవాళ్ళం చెపుతున్నాం విను. మా నాయనగారి పేరు పార్వ తీశం గారు. వెంకట పార్వతీశం అని వ్రాయి. నీ కిష్టంలేకపోతే మరో పేరు పెట్టి పిలుచుకో.''

రామనాథం ముఖంలో నిర్లిప్త భావము లాస్యం చేసింది. తలవంచుకుని తండ్రి చెప్పినట్లు చేశాడు.

శారద గదిలో చిన్నదీపం మిణుకు మిణుకుమంటున్నది. పిల్లవాడిని పక్కలో పడుకోబెట్టుకుని నిశ్చింతతో నిద్రపోతున్నది శారద. తండ్రిగదిలో అని

కిడిలేదని గ్రహించిన రామనాథం మెల్లిగా శారద గదిలోకి వెళ్ళాడు. టార్చి దీపంవేసి పిల్లవాడి ముఖం పరిశీలనగా చూశాడు. పసిపిల్లలను ఇదివరలో ఎప్పుడూ అంతదగ్గరగా అతడు చూడలేదు. ఆ ముఖం ఎక్కడో చూసినట్టు అనిపించింది. చప్పున వెనక్కి తిరిగాడు.

"ఆ పోలిక ఎక్కడో బాగా చూసినట్టుందేం?"

"ఎక్కడ?"

"ఎప్పుడు?"

"ఎవరిది?"

గదిలో పడక్కుర్చీలో మేనువాల్చాడు. ఒక ప్యాకెట్టు సిగరెట్లు మసి అయిపోయాయి. అతడి మనస్సులో సప్తసముద్రాలు ఘోషిల్లుతున్నాయి. ఆలోచనలు అలల్లా పైకెగిసిపడుతూ ఒడ్డుకు చేరకముందే విరిగిపడుతున్నాయి. గతస్మృతులు నూతనత్వాన్ని పుంజుకుని తరంగాలవలె వచ్చి అతని హృదయాన్ని కలచి వేస్తున్నాయి.

ఆఫీసు పనిమీద రామనాథం విశాఖపట్నం వెళ్ళి తిరిగివస్తూ రాజమండ్రిలో ఒకపూట ఆగాడు. స్నేహితుడు ఆ పూట తన పినతండ్రి ఇంటికి వెళ్ళుతూ రామనాథాన్ని కూడా భోజనానికి తీసుకువెళ్ళాడు. తీరా భోజనానికి కూర్చున్న తరువాత వడ్డించిన మనిషి శారద. రామనాథాన్ని అక్కడచూసి ఆమెకు కలిగిన విస్మయమూ తొట్రుపాటూ వడ్డనలో తెలుస్తూనే ఉన్నది. చేతులు ఒణుకుతున్నాయి. నెయ్యి ఒకచోట వెయ్యాలనుకుంటే మరోచోట పడుతున్నది.

రామనాథం తెలియనట్టే భోజనంచేసి బయటపడ్డాడు.

శారదకు నడుమునొప్పి వస్తున్నదనీ ఒకచిన్న ఆపరేషను కావలసి ఉన్నదనీ కనకమ్మ అప్పుడప్పుడు అంటూ వుండేది. ఒకసారి మరీ ఎక్కువగా నొప్పి వచ్చి నాలుగురోజులు లేవలేదు. విశాఖపట్నంలో ఆపరేషనుకు ఏర్పాటు చేశాడు నరసింహం. ఆపరేషను తర్వాత డాక్టర్లు రెస్టు కావాలన్నారని విజయనగరంలో ఉన్న తన పినతల్లి కొడుకు ఇంట్లో దిగవిడిచి వచ్చాడు. "డాక్టర్లు ఆరునెలల్లు

చాలన్నారు కాని అబ్బాయీ! మరో రెండు నెలలు ఉండనీయరా. మరీ బలహీ-
నంగా ఉంది. ఇక్కడ పిల్లలతో చాకిరి చెయ్యలేకుండా ఉన్నది'' అన్నాడు.

పదినెలల తరువాత శారద వచ్చింది. మనిషి బాగా ఆరోగ్యంగా ఉన్నట్టు
కనబడ్డది పారి పోయినట్టుండే ఆమె ముఖంలోకి కొత్తరక్తము వచ్చింది. నూత్న
యౌవనంతో మిసమిసలాడే నవోఢలా తయారయింది.

విజయనగరంలో వున్నదనుకుని తను ఎన్నో ఉత్తరాలు వ్రాశాడు! ఒక్క-
దానికయినా జవాబులేదు. కుటుంబ వాసనలనుండి దూరంగా కొంతకాలమయినా
ఉండాలను కుందేమో-రాజమండ్రి ఎప్పుడు వచ్చింది? తన ఉత్తరాలే
మయినట్టు?

రామనాథం ప్రశ్నలకు జవాబు దొరకటంలేదు. తలంతా వేడెక్కింది.

పిల్లవాడు లేచాడు. ఆ ఏడుపుకు శారదకూడా లేచింది పిల్లవాడికి పాలిచ్చి
పడుకోబెట్టినట్టుంది. ఓరవాకిలిగా ఉన్న తలుపు సందుల్లోనుంచి దీపము కనపడు
తోంది. శారద లేచి తలుపు తెరిచింది. రామనాథం మెలకువతోనే ఉన్నాడని తెలుసు
కుంది. సిగరెట్లమసి చూసి రెండు పాకెట్లయినా కాల్చి ఉంటాడనుకుంది.

''ఇవాళ ఇంత తొందరగా లేచి కుర్చీ మీదికి వచ్చారేం? కొత్త నవలలే
మయినా తెచ్చారేమిటి?''

ఆమెను చూడగానే ఘోరవిషాలు గ్రక్కే కుపిత భుజంగాలవలె ఉద్రిక్త
భావాలు బుస్సున పైకి లేచాయి. అతడి మస్తిష్కంలో ఆమె అడిగిన ప్రశ్నకు
జవాబు చెప్పటానికి అసహ్యము వేసింది ముక్కు ముడతలు పడ్డది.

''లేవట మేమిటి? అసలు నిద్రపోనిదే?'' అన్నాడు ముఖం ముడుచుకొని.

''ఎందుకని? అమ్మ అన్నది మీరు సుస్తీగా ఉంటున్నారని. ఏమిటి సంగతి?''
వెల్లిపాయల ఘుమాయింపులో ఆమె ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తున్నది.

''నా సుస్తీకేం లే. నేను రేపు ఊరికి వెళ్ళుతున్నాను'' తన మనసులోఉన్న
అసహ్యాన్ని వెళ్ళగ్రక్కాడు.

"ఒంట్లో బాగాలేదంటూ ఈ ప్రయాణమేమిటి?" ఆమె నిలబడిన విధానమూ. అతడిని ప్రశ్నించే పద్ధతీ ఆమె ముఖవైఖరీ చూసి "ఓ-ఏమిటా ఫోజు" అనుకున్నాడు. ఇదివరలో అయితే ఆ ఫోజుకు మురిసి ఆతడంత దూరంలో ఉండగలిగేవాడు కాదు. ఇప్పుడు ఎంత నంగనాచిలే అనుకున్నాడు మనసులో.

"ఇంట్లో నుంచి బయటపడితే గాని మనసుకూ దేహానికీ స్వస్థత చిక్కదు"

"అనుకున్నపని జరిగితేనే గాని కొందరికి మనసు తేలికగా ఉండదు. మీకు వెళ్ళాలని అంతగా ఉంటే వెళ్ళరండి".

తను వెళ్ళిపోతే శారదకు హాయిగా ఉండేటట్టున్నది. రామనాథం చేతిలో వున్న సిగరెట్టు ముక్క కసికొద్దీ కిటికీగుండా బయటికి విసిరాడు.

"అబ్బాయిని చూశారా? ఎప్పుడయినా అంతపసిబిడ్డను మీరు ఎత్తుకున్నారా తీసుకురానా? అబ్బాయికి తల వెంట్రుకలు ఒత్తుగా ఉన్నాయని ఎనిమిది పౌండ్ల బరువు ఉన్నాడనీ, అన్నిటికంటె ముఖ్యమయినది ముక్కూనోరు విలక్షణంగా ఉన్నాయనీ చెప్పి తన సంతోషాన్ని అతడితో పంచుకోవాలని ఆమెకు గడిచిన పదిరోజులనుండీ ఆత్రంగా ఉంది. ఆ పదిరోజులలో ఒక్కటంటే ఒక్కసారి పెదవి కదల్పకుండా అరనిమిషం ఉయ్యాలలోకి తొంగిచూశాడు రామనాథం.

ఉప్పొంగిన ఆనందోత్సాహాలతో శారద తన గదివైపుకు అడుగులు వేస్తున్నది. పిల్లవాడిని తీసుకురావటానికి.

"వద్దు"

శారద ఉలిక్కిపడి వెనక్కు తిరిగి చూసింది. రామనాథం చివాలున కుర్చీలో నుంచి లేచి బయటకు వెళ్ళాడు.

మధ్యాహ్నం నరసింహం తాఫీగా కాఫీ తాగుతున్నాడు గడపమీద కూర్చుని, కనకమ్మ నవ్వుముఖంతో గోడకానుకుని కూర్చున్నది. పిల్లలు నలుగురూ పసిబిడ్డ మంచందగ్గర చేరారు.

ఉదయంనుంచీ ఇంటికిరాని రామనాథాన్ని గురించి ఆలోచిస్తున్నది శారద. ఈ బిడ్డనుచూసి నరసింహం సంబర పడిపోతున్నాడు, కనకమ్మ పరేసరి ఆమెకు

కాలు నేలమీద ఆనటంలేదు. అన్నగారిమీద గౌరవం హెచ్చింది.అల్లుడిమీదప్రేమాభిమానాలు ఇనుమడించాయి. పిల్లలమీద ఆపేక్ష పొంగిపోతున్నది. శారద అదృష్టాన్ని వేనోళ్ళ పొగుడుతున్నది. ఈమార్పు శారద కెంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది.

మధ్యాహ్నం మూడుగంటలవేళ తలుపులు తోసుకుంటూ రామనాథం గదిలోకి వచ్చాడు. శారద పిల్లవాడిని పడుకోబెట్టి గదిలోకి వెళ్ళేసరికే పెట్టె సర్దుకుని పక్క చుట్టచుట్టుకున్నాడు. బండిలో సామాను పెట్టించుకుంటూఉండగా నరసింహం బయటికివచ్చి "ఎన్నాళ్ళలా నీ ప్రయాణం?" అడిగాడు.

"వచ్చేఏడు నాకు ప్రమోషను వస్తుందిట. అందుకని ఇప్పుడు మద్రాసు ట్రైనింగుకు పంపుతున్నారు. ఒక ఏడాది పట్టవచ్చు" సమయానికి తనకామాట తోచినందుకు రామనాథం మనసులో సంతోషపడుతూ ముందడుగువేశాడు.

"ఇన్నాళ్ళనుంచీ ఆమాట చెప్పవేం" నరసింహం వాకిట్లోకి వచ్చాడు.

"నా కివాళే తెలిసింది" రామనాథం అందరివైపూ ఒక్కసారిగాచూసి బండి యెక్కాడు.

కాలినడకన పక్కదారిగుండా నరసింహం స్టేషనుకు చేరుకునే టప్పటికి రైలు గంట లేటని తెలిసింది. ప్లాటుఫారం టికెట్టు కొనుక్కుని లోపలికి వెళ్ళి వెయిటింగు రూముముందర నిలబడి ఉన్న రామనాథం భుజమ్మీద చెయ్యివేశారు.

రామనాథం గతుక్కుమన్నాడు.

"మీరు ఎందుకు వచ్చారు నాన్నా యిప్పుడు?" అయిష్టంతో కుర్చీ చూపించాడు కూర్చోమని.

"రామనాథం నావంకచూడు నీవు నిజంగా మద్రాసు వెళ్ళాలనే బయలుదేరావా? ఎందుకీ అబద్ధం? నీ సంగతంతా ఈ పదిరోజులనుంచీ నేను కనిపెడుతూనే ఉన్న. నాకోసం తెచ్చిన నిద్రమాత్రలు కొన్ని సీసాలో తీసుకుని తిరుగుతున్నావు. నీ ఆఫీసుకు నిన్న వెళ్ళి కనుక్కున్నా." గబగబా నడిచిరావటం వల్ల నరసింహానికి ఆయాసం వచ్చింది రామనాథాన్నిచూడగానే ఉద్రేకం వచ్చింది. ఆపరేషను చేయించుకుని బాధపడుతున్న కాలిమీద లేచిన నారిపుండు పలపటం మొదలు

పెట్టింది. ఉత్తరీయంతో ముఖమంతా ఒక్కసారి తుడుచుకుని రెప్పలార్పుకుంటూ కళ్ళల్లో ఊరుతున్న చెమ్మని పైకి పొంగనీయకుండా అదిమిపెడుతున్నాడు.

"నీవు రాజీనామాయిచ్చి వెళ్ళిపోతున్నట్టు ఆఫీసులో చెప్పారు. అసలు విషయానికి వద్దాం, నీ సంతానాన్ని దుర్దశనుండి తప్పించాలని ఒక జ్యోతిష్కుడిని సలహా అడిగాను. మామూలుగా కాన్పువచ్చేటైము తప్పించి చూడమన్నాడు. ఆటైము తప్పితే అలోపము పోవచ్చు నన్నాడు కేవలం ఇది ప్రయోగముమాత్రమే. అందుచేత శారదకూ నీకూ చెప్పకుండా అలా చెయ్యవలసి వచ్చింది. ఫలితం చూశావుగా."

రామనాథం ఈమాటలు విననట్టూ తనకేమీ పట్టనట్టూ అంతదూరాన ఉన్న రైలుపట్టాలవైపు చూస్తున్నాడు

"శారదకు ఏదో జబ్బుఉందని చెప్పి అంతదూరాన ఉంచి టానిక్కులు ఇప్పించాను. రాజమండ్రిలో శారద ఉన్నదంటే నీవు వెళ్తావని విజయనగరంలో ఉన్నదని చెప్పాను. మనమందరమూ పడిన కష్టాలకు దేవుడు సత్ఫలితాన్ని యిచ్చాడు."

తండ్రివైపు అనుమానంగా చూశాడు రామనాథం.

"అసలు నీకీ విషయమంతా ముందే చెప్పవలసింది. పిల్లలకు నమ్మకాలు ఉండవని చెప్పలేదు. శారద మొండి కేసింది. దాన్ని ఒప్పించేసరికి పెద్దలు దిగి వచ్చారు. అయినా అసలుసంగతి మీ యిద్దరితో చెప్పకపోవటం నాతప్పే, చెపానుగా-ఇదంతా ప్రయోగమేనని. నామటుకు నాకే నమ్మకం లేకపోయింది.

"మమ్మల్ని నమ్మించటానికి పెట్టెలో పాతబట్టలు పెట్టుకున్నావు. నీవు బయలుదేరింది మదరాసుకుకాదు. ఆరైలుకని మమ్మల్ని నమ్మించి చీకటిపడగానే రైలుకింద పడాలని వచ్చావు. నీకు అందరూ అటువంటి పిల్లలే పుడతారన్న నైరాశ్యానికి వచ్చావు చక్కగాపుట్టిన పిల్లవాడిని చూడగానే శారదను అనుమానించావు".

నరసింహానికి ఎలా తెలిసిందన్నట్టుగా ముఖం పైకెత్తి ఆతడి కళ్ళలోకి సూటిగా చూశాడు రామనాథం.

"ఇదిగో ఉత్తరం. విషం కక్కుతూ శారదకు నీవు రాసిన ఉత్తరం. అది చూసుకోవాలనీ కుళ్ళి కుళ్ళి ఏడవాలనే రాసి దిండుకింద పెట్టావు. శారద చూడకుండా నేను జాగ్రత్తపడ్డాను. మేమందరమూ ఎంత సంతోషపడుతున్నామో నీవంత అనుమానానికి లోనవుతున్నావు"

తల వంచుకుని పాంటుజేబులోకి చెయ్యి పోనిచ్చాడు రామనాథం.

"రాధా"

నరసింహానికి కొడుకును ఆప్యాయంగా పిలవాలంటే రాధా అనటము అలవాటు. రామనాథం తల్లి అతడిని అలా పిలిచి చిన్నప్పుడు ఆడపిల్లల బట్టలువేసి అలంకారము చేసి ఆనందించేది.

రామనాథం ఆ పిలుపుకు కరిగిపోయాడు. తల్లి కళ్ళల్లో మెదిలింది. "నాన్నా" అంటూ తండ్రిని కౌగిలించుకున్నాడు. తండ్రి తన బలమైన చేతులతో కొడుకును గుండెకు హత్తుకుంటూ "వసంతాన్ని శిశిరం చేసుకోకు. ఇంటికిపోదాం పద" వీపు మీద చెయ్యివేసి నిమిరాడు. కుమారుడి వేడివేడి కన్నీళ్ళతో అతడి కండువా తడిసి ముద్దయింది.

సాంధ్య కిరణ సమేతుడైన రవి తండ్రి కొడుకులను ఇంటివరకూ సాగనంపాడు. ఆప్యాయంగా కబుర్లు చెప్పుకుంటూ ఇంటికివచ్చిన వాళ్ళను చూసి "రైలు తప్పిందా ఏమిటీ" అన్నది కనకమ్మ.

('జయశ్రీ'-సంక్రాంతి సంచిక)